క్లుప్తంగా

చదువుతో పాటు సమాజ సేవ చేయాలి



పాఠశాల ఆవరణలో శుభ్రం చేస్తున్న వలంటీర్లు

వేములవాడఅర్బన్‌: విద్యార్థులు చదువుతో పాటు సమాజ సేవలో ముందుండాలని కరీంనగర్‌ ఎస్‌ఆర్‌ఆర్‌ డిగ్రీ కళాశాల రిటైర్డ్‌ ప్రిన్సిపాల్‌ మురళి, ఎన్‌జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం సలహా కమిటీ సభ్యుడు వెలమల రెడ్డి అన్నారు. వేములవాడ మండలం అగ్రహారం ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఎన్‌ఎస్‌ఎస్‌ వలంటీర్లు మారుపాక గ్రామంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక శిబిరంలో వారు మాట్లాడారు. సమాజసేవలో ఎన్‌ఎస్‌ఎస్‌ వలంటీర్ల పాత్ర అభినందనీయమని అన్నారు. ప్రత్యేక శిబిరం రెండోరోజు మారుపాక రైతు వేదిక, జెడ్పీహెచ్‌ఎస్‌ పరిసరాలను శుభ్రపరిచారు. కార్యక్రమంలో ఎన్‌ఎస్‌ఎస్‌ యూనిట్‌ పోగ్రాం అధికారి తిరుకోవెల శ్రీనివాస్‌, అధ్యాపకులు శ్రీనివాసులు, నారాయణ, దీపిక, వలంటీర్లు పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన ఉండాలి



హెల్ప్‌లైన్‌ నంబర్లు ప్రదర్శిస్తున్న అధికారులు

వేములవాడఅర్బన్‌: వేములవాడ పట్టణం, అగ్రహారం బీసీ హాస్టల్‌ విద్యార్థినులకు ఐసీడీయస్‌, జిల్లా సఖీ కేంద్రం ఆధ్వర్యంలో విద్యార్థినులకు చట్టాలు, హెల్ప్‌లైన్‌ నంబర్లపై ఆదివారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా గృహహింస నిరోధక చట్టం, బాల్య వివాహ నిరోధక చట్టం, ఆస్తిహక్కు చట్టం, వివిధ చట్టాలపై తెలియజేశారు, అలాగే టోల్‌ ఫ్రీ నెంబర్లు 181, 100, 1098 తెలిపారు. కార్యక్రమంలో జిల్లా శిశు సంక్షేమశాఖాధికారి లక్ష్మిరాజ్యం, సఖీ సెంటర్‌ అధికారి రోజ, హాస్టల్‌ వార్డెన్‌ జ్యోతి, విద్యార్థినులు పాల్గొన్నారు.

బీసీ కులగణన అంశాన్ని లేవనెత్తండి



వీరయ్యకు వినతిపత్రం ఇస్తున్న రవిగౌడ్‌

సిరిసిల్లటౌన్‌: బీసీ కుల గణన అంశాన్ని దేశవ్యాప్తంగా లేవనెత్తాలని బీసీ విద్యార్థి సంఘం రాష్ట్ర కన్వీనర్‌ కంచర్ల రవిగౌడ్‌ కోరారు. ఈమేరకు ఆదివారం సిరిసిల్లకు విచ్చేసిన సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు ఎస్‌. వీరయ్యకు వినతిపత్రం ఇచ్చి మాట్లాడారు. ఉద్యోగాలు, ఉపాధి, పైచదువులు, తదితర అంశాల్లో బీసీలకు జరుగుతున్న అన్యాయాన్ని వివరించారు. బీసీలకు న్యాయం చేకూర్చడానికి వామపక్షాలు కలిసి రావాలని కోరారు. నాయకులు ఇల్లందుల ప్రకాష్‌, మట్ట నరేశ్‌ పాల్గొన్నారు.

సబ్‌స్టేషన్‌ ఏర్పాటు ఎప్పుడో.?

- ఓవర్‌ లోడ్‌తో విద్యుత్‌ అంతరాయం
- ఇబ్బందిపడుతున్న రైతులు
- సబ్‌స్టేషన్‌ ఏర్పాటు చేయాలని వేడుకోలు



నాంపల్లి విద్యుత్‌ సబ్‌స్టేషన్‌

వేములవాడఅర్బన్‌: ప్రభుత్వం నాణ్యమైన విద్యుత్‌ను అందించేందుకు ప్రతి రెండు నుంచి మూడు గ్రామాలకు ఒక సబ్‌స్టేషన్‌ ఏర్పాటు చేయాలని చెబుతుంది. ఇతర మండలాల్లో కూడా ఇలా ప్రతి రెండు, మూడు గ్రామాలకు ఒక సబ్‌స్టేషన్‌ ఏర్పాటు చేశారు. కాని వేములవాడ అర్బన్‌ మండలానికి మాత్రం 11 గ్రామాలు, రెండు వీలిన గ్రామాలు కలిపి మొత్తం 13 గ్రామాలకు ఒకే ఒక 33/11 కేవీ సబ్‌స్టేషన్‌ ఉంది. ఆ సబ్‌స్టేషన్‌ కూడా ఓవర్‌ లోడ్‌తో గంటకు ఒకసారి కరెంట్‌ ట్రిప్‌ అవుతుంది. అలాగే ఒకే సబ్‌స్టేషన్‌ ఉండటం వల్ల ఏ గ్రామంలో విద్యుత్‌ మరమ్మతులు చేయాలన్నా విద్యుత్‌ నిలిపివేస్తున్నారు. దీంతో అన్ని గ్రామాలకు విద్యుత్‌ అంతరాయం కలుగుతోంది. దీంతో రైతులు, గ్రామాల ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. ప్రభుత్వం, సెస్‌ అధికారులు స్పందించి మరో సబ్‌స్టేషన్‌ ఏర్పాటు చేయాలని స్థానికులు కోరుతున్నారు.

ఒక్క సబ్‌స్టేషన్‌ కింద 13 గ్రామాలు

వేములవాడ అర్బన్‌ మండలంలోని సంకెపల్లి, ఆరెపల్లి, రుద్రవరం, అనుపురం, కొడుముంజ, శాభాష్‌పల్లి, చింతాల్‌ఠాణా, నాంపల్లి, తిప్పాపూర్‌, మారుపాక, గుర్రవానిపల్లి, చంద్రగిరి, చీర్లవంచ గ్రామాలకు కలిపి ఒక 33/11 కేవీ సబ్‌స్టేషన్‌ నాంపల్లిలో ఉంది. ఈ సబ్‌స్టేషన్‌తో వ్యవసాయ బావులు, ఇళ్లు, క్రషర్లు, సిమెంట్‌ ఇటుక పరిశ్రమలు, రెండు జిన్నింగ్‌ మిల్లులు, అగ్రహారంలోని ఎస్‌ఆర్‌ఆర్‌ ప్రభుత్వ పాలిటెక్నిక్‌ కళాశాల, ప్రభుత్వ డిగ్రీ కళాశాల, వేములవాడ ఆర్టీసీ డిపో, జేఎన్టీయూ ఇంజనీరింగ్‌ కళాశాల, డైరీ ఫామ్‌లు, పౌల్ట్రి ఫామ్‌లకు ఒక సబ్‌స్టేషన్‌ నుంచి విద్యుత్‌ వినియోగం వల్ల ఓవర్‌ లోడ్‌తో విద్యుత్‌కు అంతరాయం కలుగుతోందని సెస్‌ అధికారులు అంటున్నారు.

రైతులకు తప్పని తిప్పలు..

ఎండలు మండుతున్నాయి. వ్యవసాయ బావుల్లోని నీరు రోజు రోజుకు అడుగంటుతోంది. దీంతో రైతులు వ్యవసాయ బావులకు ఏర్పాటు చేసే మోటర్లు ఆటోమెటిక్‌ స్టాటర్లు పెడితే బావిలో నీరు అయిపోయి మోటర్లు కాలిపోతాయని పెట్టడం లేదు. విద్యుత్‌ ఓవర్‌ లోడ్‌తో గంటకు ఒకసారి ట్రిప్‌ అవడంతో రైతులు పొలాల వద్దనే కావలి ఉండాల్సి వస్తోంది. ఇలా రోజుకు పదిసార్లు కరెంట్‌ ట్రిప్‌ అయితే వరి పంట చేతికి రావడం కష్టమని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ముంపునకు గురైన సబ్‌స్టేషన్‌

రుద్రవరం గ్రామంలో గతంలో ఉన్న 33/11 కేవీ సబ్‌స్టేషన్‌ మిడ్‌ మానేరు ముంపునకు గురైంది. అన్ని ఆర్‌అండ్‌ఆర్‌ కాలనీల్లో ప్రభుత్వం అన్ని ప్రభుత్వ కార్యాలయాలకు స్థలం కేటాయించింది. కాని సబ్‌స్టేషన్‌కు మాత్రం స్థలం కేటాయించకపోవడంతో ఇప్పటి వరకు సబ్‌స్టేషన్‌ ఏర్పాటు వాయిదా పడింది. ఆ సబ్‌స్టేషన్‌ ఉన్నప్పుడు విద్యుత్‌ను సంకెపల్లి, రుద్రవరం, ఆరెపల్లి, నాంపల్లి సగభాగం విద్యుత్‌ను అందించింది. ఇప్పుడు కూడా నూతన సబ్‌స్టేషన్‌ ఏర్పాటు చేస్తే ఆదే మాదిరిగా గ్రామాలకు నాణ్యమైన విద్యుత్‌ అందుతుందని గ్రామాల ప్రజలు అంటున్నారు.

గంటకు ఒక్కసారి కరెంట్‌ పోతోంది



ఎండలు మండుతుండటంతో వరి పొలాల్లో నీరు ఉండటం లేదు. గంటకు ఒక్కసారి విద్యుత్‌ పోతూ వస్తోంది. దీంతో పొద్దంతా పొలాల వద్దనే ఉంటున్నాం. సెస్‌ అధికారులు పట్టించుకోవాలి.

– కుదుకల కొమురయ్య, రైతు, గొల్లపల్లె

సబ్‌స్టేషన్‌ ఏర్పాటు చేయాలి



గతంలో రుద్రవరంలో సబ్‌స్టేషన్‌ ఉంది. ఇప్పుడు కూడా సబ్‌స్టేషన్‌ ఏర్పాటు చేయాలని పలుమార్లు సెస్‌ అధికారులకు విన్నవించాం. సెస్‌ డైరెక్టర్‌, సెస్‌ అధికారులు పట్టించుకుని త్వరగా ఏర్పాటు చేయాలి.

– గాలిపెల్లి స్వామి, రుద్రవరం

స్థలాన్ని పరిశీలించాం



వేములవాడ మండలం రుద్రవరం గ్రామంలో సబ్‌స్టేషన్‌ ఏర్పాటు కోసం ఇటీవల స్థలం పరిశీలించాం. అధికారులతో మాట్లాడి త్వరలోనే పనులు కూడా ప్రారంభించేలా చర్యలు తీసుకుంటాం.

– రేగులపాటి హరిచరణ్‌రావు,సెస్‌ డైరెక్టర్‌, వేములవాడ అర్బన్‌

ఆత్మీయ సమ్మేళనాలతో పార్టీ పటిష్టం

- చొప్పదండి ఎమ్మెల్యే సుంకె రవిశంకర్‌

బోయినపల్లి: సీఎం కేసీఆర్‌ పిలుపు మేరకు నియోజకవర్గంలోని అన్ని మండలాల్లో బీఆర్‌ఎస్‌ ఆత్మీయ సమ్మేళనాలు ఏర్పాటు చేయనున్నట్లు ఎమ్మెల్యే సుంకె రవిశంకర్‌ తెలిపారు. ఆదివారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మండల బీఆర్‌ఎస్‌ నాయకులతో ఏర్పాటు చేసిన ఆత్మీయ సమ్మేళనం సన్నాహక సమావేశంలో మాట్లాడారు. కార్యకర్తల్లో ఉత్సాహం నింపి పార్టీ పటిష్టతకు కృషి చేయాలని కోరారు. ఎంపీపీ వేణుగోపాల్‌, ఏఎంసీ చైర్మన్‌ సత్యనారాయణరెడ్డి, వైస్‌ చైర్మన్‌ సుధాకర్‌రావు, వైస్‌ఎంపీపీ నాగయ్య, సెస్‌ డైరెక్టర్‌ సుధాకర్‌, బీఆర్‌ఎస్‌ మండల అధ్యక్షుడు కొండయ్య, కోఆప్షన్‌ సభ్యుడు అజ్జు, సర్పంచులు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే రవిశంకర్‌

కార్యకర్తలకు అండగా ఉంటాం

రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన మండలంలోని తడగొండ గ్రామానికి చెందిన బీఆర్‌ఎస్‌ కార్యకర్త కట్ట రాజమల్లయ్య కుటుంబానికి అండగా ఉంటామన్నారు. రాజమల్లయ్య భార్య వీరమ్మ ఆదివారం ఎమ్మెల్యేను కలిశారు. ఇన్సూరెన్స్‌ ఫైల్‌ను తెలంగాణ భవన్‌కు పంపించినట్లు తెలిపారు.



అపూర్వ సమ్మేళనం

ముస్తాబాద్‌: స్థానిక జెడ్పీహెచ్‌ఎస్‌లో 1987-88 ఎస్సెస్సీ బ్యాచ్‌ విద్యార్థులు 35 ఏళ్ల తరువాత ఒకే వేదికపై ఆదివారం కలుసుకున్నారు. ప్రజాప్రతినిధులుగా, ప్రభుత్వ అధికారులుగా, వివిధ రంగాల్లో స్థిరపడిన వారు పాత జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. అనంతరం ఉపాధ్యాయులను సన్మానించారు.

అందరూ ఆరోగ్యంగా ఉండాలి

- వేములవాడ ఎమ్మెల్యే రమేశ్‌బాబు

వేములవాడ: ప్రస్తుత సమాజంలో ప్రతి ఒక్కరూ తమ ఆరోగ్యాలపై దృష్టి సారించాలని, ప్రతి ఆరు నెలలకోమారు తప్పకుండా వైద్య పరీక్షలు నిర్వహించుకోవాలని ఎమ్మెల్యే రమేశ్‌బాబు కోరారు. లయన్స్‌ క్లబ్‌ ఆధ్వర్యంలో సికింద్రాబాద్‌ యశోద హాస్పిటల్స్‌ వారిచే ఉచిత వైద్య శిబిరాన్ని ఆదివారం ఆయన ప్రారంభించారు. స్థానిక ప్రభుత్వ హైస్కూల్‌లో జరిగిన ఈ కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించి రోగులు, వైద్యులతో మాట్లాడారు. రోగ నిర్ధారణ చేసుకుంటేనే వైద్యం చేయించుకోవచ్చన్నారు. అనంతరం లయన్స్‌క్లబ్‌ అధ్యక్షులు రాపెల్లి శ్రీధర్‌ను ఎమ్మెల్యే అభినందించారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్‌ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య,



రోగితో మాట్లాడుతున్న ఎమ్మెల్యే రమేశ్‌బాబు

కౌన్సిలర్లు యాచమనేని శ్రీనివాస్‌రావు, జిల్లా మెడికల్‌ అసోసియేషన్‌ అధ్యక్షుడు పెంచలయ్య, లయన్స్‌ క్లబ్‌ క్యాబినెట్‌ మెంబర్‌ నాగ రమేశ్‌, ప్రతినిధులు కోళ్ల శ్రీనివాస్‌, వెంకటేశ్వర్‌రావు, వైద్యులు, ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.

వంద శాతం ఉత్తీర్ణత సాధించాలి

- బీఆర్‌ఎస్‌ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య

ఎల్లారెడ్డిపేట: పదో తరగతి ఫలితాల్లో జిల్లా స్థాయిలో వంద శాతం ఉత్తీర్ణత సాధిస్తూ అందరూ 10 జీపీఏలు సొంతం చేసుకోవాలని బీఆర్‌ఎస్‌ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య అన్నారు. స్థానిక విజ్ఞాన్‌ ఉన్నత పాఠశాలలో శనివారం వీడ్కోలు కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఐఐటీ పరీక్షల్లో పాల్గొని ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు సర్టిఫికెట్లు, మెడల్స్‌, ప్రశంసాపత్రాలను అందించారు. ఈ సందర్భంగా విద్యార్థుల నృత్యాలు అందరిని ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో సింగిల్‌విండో చైర్మన్‌ గుండారపు కృష్ణారెడ్డి, సెస్‌ డైరెక్టర్‌ వరుస కృష్ణహరి, ఎంపీటీసీలు అనసూయ, పందిర్ల నాగరాణి, కరస్పాండెంట్‌ లతీఫ్‌, తల్లిదండ్రులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఆగయ్య

బ్రిడ్జి నిర్మాణానికి మోక్షమెప్పుడో?

- రూ.20 లక్షలు మంజూరైనా మొదలు కాని పనులు
- వర్షం కురిస్తే రాకపోకలు బంద్‌
- పట్టించుకోని అధికారులు



ఒర్రెపై తాత్కాలికంగా వేసిన మట్టి రోడ్డు

ఇల్లంతకుంట: మండలంలోని తాళ్ళపల్లి నుంచి బెజ్జంకి మండలం గూడెం, బేగంపేట గ్రామాలకు వెళ్లే దారిలో ఉన్న ఒర్రెపై బ్రిడ్జి నిర్మాణం కలగానే మిగిలింది. తాళ్లపల్లి శివారులోని చెరువు నిండి మత్తడి దూకితే ఈదారి మధ్యలో ఉన్న ఒర్రె ఉధృతంగా ప్రవహిస్తుంది. దీంతో వ్యవసాయ పొలాలకు వెళ్లే రైతులతో పాటు, బేగంపేట, గూడెం, గుండ్లపల్లి వరకు వెళ్లే వాహనదారులకు ఇబ్బందులు తప్పడం లేదు. ప్రతి ఏడాది ఒర్రెపై బ్రిడ్జి నిర్మించాలని స్థానిక ప్రజాప్రతినిధులు, రైతులు ఎమ్మెల్యే రసమయి బాలకిషన్‌కు మొరపెట్టుకోగా ప్రభుత్వం నుంచి బ్రిడ్జి నిర్మాణానికి గత ఎడాది క్రితం రూ.20 లక్షలు మంజూరు చేయించారు. బెజ్జంకి మండలానికి చెందిన ఓ కాంట్రాక్టర్‌ ఈ బ్రిడ్జి నిర్మాణం టెండర్‌ దక్కించుకోగా ఇప్పటి వరకు పనులు మాత్రం ప్రారంభించ లేదు. మళ్లీ వర్షాకాలం రెండు నెలల్లో రాబోతుందని, సంబంధిత కాంట్రాక్టర్‌ ఏడాదికాలంగా ఇప్పటి వరకు బ్రిడ్జి నిర్మాణం కోసం పనులు ప్రారంభించడం లేదని రైతులు, వాహనదారులు ఆందోళన చెందుతున్నారు. బ్రిడ్జి నిర్మించి అందుబాటులోకి తీసుకురావాలని కోరుతున్నారు.

ఒర్రెపై తాత్కాలికంగా మట్టి రోడ్డు

తాళ్ళపల్లి స్టేజీ నుంచి గూడెం వెళ్లే రోడ్డు దాదాపు రెండు కిలోమీటర్ల మేరకు బీటీ రోడ్డు నిర్మించారు. కాని ఒర్రెపై బ్రిడ్జి మాత్రం నిర్మించకపోవడంతో కోతకు గురైన ఒర్రెపై తాత్కాలికంగా మట్టి రోడ్డు వేశారు. వర్షం కురిస్తే ఈ రోడ్డు కూడా కోతకు గురవుతుందని రైతులు, వాహనదారులు అంటున్నారు. బ్రిడ్జి నిర్మించేందుకు ఆరు నెలల నెలల క్రితమే పైపులు తెచ్చి రోడ్డు పక్కన పడేశారని, కాని ఇప్పటి వరకు బ్రిడ్జి నిర్మాణం మాత్రం ప్రారంభించలేదని ప్రజలంటున్నారు.

పనులు ప్రారంభించేలా చూస్తాం



మండలంలోని తాళ్లపల్లి నుంచి గూడెం, బేగంపేట వెళ్లే రోడ్డు మధ్యలో ఉన్న ఒర్రెపై బ్రిడ్జి నిర్మాణానికి ఎమ్మెల్యే రసమయి ప్రభుత్వం నుంచి రూ.20 లక్షలు మంజూరు చేయించారు. కాంట్రాక్టర్‌ పనులు ఇంకా ప్రారంభించలేదు, త్వరలోనే పనులు ప్రారంభించేలా చూస్తాం.

– వెంకటరమణారెడ్డి, ఎంపీపీ, ఇల్లంతకుంట

బ్రిడ్జి నిర్మాణం పూర్తి చేయాలి



తాళ్లపల్లి నుంచి గూడెం, బేగంపేట వరకు వెళ్లే రోడ్డు మధ్యలో ఉన్న ఒర్రెపై బ్రిడ్జి నిర్మించకపోవడంతో వర్షాలు కురిస్తే పొలాలు, ఇతర గ్రామాలకు వెళ్లేందుకు ఇబ్బంది పడుతున్నాం. బ్రిడ్జి నిర్మాణానికి ఏడాది క్రితమే నిధులు మంజూరు చేశామని చెప్పి ఇప్పటి వరకు పనులు ప్రారంభించలేదు.

– పల్లె సాయిప్రసాద్‌రెడ్డి, తాళ్లపల్లి

పంట నష్టానికి పరిహారం ఇవ్వాలి

వీర్నపల్లి: మండలంలోని వన్‌పల్లి, శాంతినగర్‌, సీతారామ్‌ నాయక్‌, జవహర్‌ నాయక్‌ తండాలలో శనివారం రాత్రి కురిసిన వర్షానికి నెలకొరిగిన వరి పంటలను బీజేపీ మండల అధ్యక్షుడు దేవేందర్‌రెడ్డి అధ్వర్యంలో పార్లమెంట్‌ కో-కన్వీనర్‌, మాజీ మున్సిపల్‌ చైర్మన్‌ అడెపు రవీందర్‌, బీఎస్‌పీ జిల్లా ప్రధాన కార్యదర్శి లింగంపల్లి మధుకర్‌ వేర్వేరుగా పరిశీలించారు. నష్టపోయిన రైతులకు ప్రభుత్వం రూ.50 వేలు ఆర్థికసాయం అందించి ఆదుకోవాలన్నారు. కార్యక్రమంలో బీఎస్‌పీ నాయకులు గజ్జెల అశోక్‌, ఈసంపల్లి కొమురయ్య, జింక నాగరాజు, ప్రశాంత్‌, తిరుపతి, స్వామి, శ్రీకాంత్‌ పాల్గొన్నారు.

రెండు రోజులు సర్వే నిర్వహిస్తాం

నష్టపోయిన పంటలను డిప్యూటీ తహసీల్దార్‌ ప్రవీణ్‌కుమార్‌, వ్యవసాయాధికారి భూంరెడ్డి పరిశీలించి మాట్లాడారు. సోమవారం నుంచి రైతుల పంట పొలాల వద్దకు వెళ్లి ఎంతవరకు నష్టం జరిగిందో సర్వే నిర్వహించి, వివరాలను ప్రభుత్వానికి పంపిస్తామన్నారు. కార్యక్రమంలో సర్పంచులు లత, శ్రీనివాస్‌, ఎంపీటీసీ భూనోత్‌ పద్మ, సెస్‌ డైరెక్టర్‌ మల్లేశం, ఏఈవో ఫజుల్‌, ఆర్‌ఐ ప్రవీణ్‌, బీఆర్‌ఎస్‌ నాయకులు పాల్గొన్నారు.



పంటను పరిశీలిస్తున్న బీఎస్పీ నాయకులు

కోనరావుపేట: మండలం మరిమడ్లలో వడగళ్ల వర్షానికి నష్టపోయిన పంటలను మండల వ్యవసాయాధికారి వెంకట్రామమ్మ ఆధ్వర్యంలో అధికారులు ఆదివారం పరిశీలించారు. మరిమడ్లలో శనివారం సాయంత్రం వడగళ్ల వర్షం కురిసి వరి, పత్తి, టమోటా తదితర పంటలు దెబ్బతిన్నాయి. ఈదురు గాలులకు ఇళ్లపై రేకులు కొట్టుకుపోయాయి. పంట నష్టం వివరాలను పూర్తిస్థాయిలో సేకరించి అధికారులకు విన్నవిస్తామన్నారు. సర్పంచ్‌ మాట్ల అశోక్‌, ఏఈవో సహజ పాల్గొన్నారు.

పంట నష్టంపై క్షేత్రస్థాయి సర్వే చేయాలి

రుద్రంగి: పంట నష్టంపై క్షేత్రస్థాయి సర్వే చేసి నివేదిక పంపించాలని బీజేపీ ఓబీసీ మోర్చా జిల్లా అధ్యక్షుడు నంద్యాడపు వెంకటేశ్‌ డిమాండ్‌ చేశారు. ఆదివారం మండల కేంద్రంలో నాయకులతో కలిసి వడగళ్ల వానకు దెబ్బతిన్న నువ్వు, వరి, మామిడి పంటలను పరిశీలించి మాట్లాడారు. నష్టపోయిన రైతులకు ఎకరాకు రూ.10 వేలు పరిహారం ఇవ్వాలని డిమాండ్‌ చేశారు. కార్యక్రమంలో నాయకులు రవి, గణేశ్‌, మహిళా మోర్చా మండల అధ్యక్షురాలు లత పాల్గొన్నారు.



నువ్వుల చేనును పరిశీలిస్తున్న వెంకటేశ్‌

అపరిచితులతో జాగ్రత్త



మాట్లాడుతున్న ఎస్సై నవత

వీర్నపల్లి: అపరిచితులతో జాగ్రత్తగా ఉండాలని ఎస్సై నవత అన్నారు. మండలంలోని రంగంపేట గ్రామంలో పోలీసులు సైబర్‌ నేరాలపై ఆదివారం నిర్వహించిన అవగాహన సదస్సులో ఆమె మాట్లాడారు. గుర్తు తెలియని వ్యక్తులు ఫోన్‌ చేసి ఏమైనా వివరాలు అడిగితే స్పందించవద్దని తెలిపారు. అలాంటి వారు ఫోన్‌ చేస్తే వెంటనే 1930 నెంబర్‌కు కాల్‌ చేసి సమాచారం ఇవ్వాలన్నారు. అనంతరం వీర్నపల్లి గ్రామ శివారులో వాహనాలు తనిఖీ చేశారు. సర్పంచ్‌ నందగిరి లింగం, ఏఎస్సై కిషన్‌రావు, కానిస్టేబుల్స్‌ ప్రశాంత్‌ పాల్గొన్నారు.

భర్త వేధిస్తున్నాడని పోలీసులకు ఫిర్యాదు

ఎల్లారెడ్డిపేట: మద్యం తాగివచ్చి నిత్యం వేధిస్తున్న భర్తపై ఒక మహిళ పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఎస్సై శేఖర్‌ తెలిపిన వివరాల ప్రకారం మండల కేంద్రానికి చెందిన వెన్ను సువర్ణకు నర్సయ్య అనే వ్యక్తితో 30 ఏళ్ల క్రితం వివాహం జరిగింది. వీరికి ఇద్దరు కూతుర్లు, ఒక కుమారుడు ఉన్నారు. నర్సయ్య ప్రతి రోజు మద్యం తాగి వచ్చి భార్యను శారీరకంగా, మానసికంగా వేధిస్తున్నాడు. అంతేకాకుండా ఈ నెల 25న రాత్రి ఇంట్లో నుంచి వెళ్లగొట్టడంతో బాధితురాలి ఫిర్యాదు మేరకు నర్సయ్యపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

ఇద్దరిపై డ్రంకెన్‌ డ్రైవ్‌ కేసు

ఎల్లారెడ్డిపేట: మండలంలోని రాచర్లగొల్లపల్లి శివారులోని మూడుగుళ్ల దగ్గర ఆదివారం రాత్రి నిర్వహించిన వాహన తనిఖీల్లో మద్యం తాగి వాహనాలు నడుపుతున్న ఇద్దరిపై డ్రంకెన్‌ డ్రైవ్‌ కేసు నమోదు చేసినట్లు ఎస్సై శేఖర్‌ తెలిపారు. తనిఖీల్లో పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

కల్యాణలక్ష్మి చెక్కులు పంపిణీ

సిరిసిల్లఅర్బన్‌: సిరిసిల్ల పట్టణంలోని 3వ వార్డులో కల్యాణ లక్ష్మి, షాదీముబారక్‌ చెక్కులను మున్సిపల్‌ చైర్‌పర్సన్‌ జిందం కళ ఆదివారం పంపిణీ చేశారు. బీఆర్‌ఎస్‌ పట్టణాధ్యక్షుడు జిందం చక్రపాణి, బొల్లి రామ్మోహన్‌, మేర్గు శేఖర్‌, గాజుల బాలయ్య, దూస రాజేశం, రఫీ, హరికృష్ణ, జగన్‌ గౌడ్‌, శ్రీకాంత్‌, వడ్డెపల్లి రమేశ్‌ పాల్గొన్నారు.

సీఎంఆర్‌ఎఫ్‌ చెక్కు..

బోయినపల్లి: మండలంలోని పలు గ్రామాలకు చెందిన 16 మంది లబ్దిదారులకు ఆదివారం ఎమ్మెల్యే సుంకె రవిశంకర్‌ రూ.4,44,000 విలువ గల సీఎంఆర్‌ఎఫ్‌ చెక్కులను తన క్యాంపు కార్యాలయంలో పంపిణీ చేశారు.

సిరిసిల్లఅర్బన్‌: 9వ వార్డులో లబ్దిదారులకు మంజూరైన సీఎంఆర్‌ఎఫ్‌ చెక్కులను ఆదివారం కౌన్సిలర్‌ లింగంపల్లి సత్యనారాయణ అందజేశారు. వార్డుకు చెందిన వీర్నాల రాజవ్వకు రూ.42,500, కళ్లెం మైపాల్‌కు రూ.45 వేల విలువగల చెక్కులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో సింగిల్‌విండో చైర్మన్‌ జీల కిషన్‌, బీఆర్‌ఎస్‌ నాయకులు మెడుదుల దేవయ్య పాల్గొన్నారు.

వీర్నపల్లి: మండలంలోని బంజేరు గ్రామానికి చెందిన బట్టు స్వప్నకు రూ.21,500 సీఎంఆర్‌ఎఫ్‌ చెక్కును సర్పంచ్‌ గుగులోత్‌ కళ అందజేశారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్‌ నాయకులు పాల్గొన్నారు.

'సింగిల్‌విండో'లో విబేధాలు

- తీర్మానం లేకుండా డబ్బులు ఖర్చు చేశారని డైరెక్టర్ల ఆరోపణ

చందుర్తి: చందుర్తి సింగిల్‌విండో పాలకవర్గ సభ్యులకు మధ్యన విబేధాలు తారస్థాయికి చేరుకున్నాయి. పాలక వర్గం ఎన్నికైన నాటి నుంచి ఇప్పటి వరకు సహకార సంఘం ఆదాయ వ్యయాలపై లెక్కలు చూపాలంటూ డైరెక్టర్లు మూకుమ్మడిగా అధ్యక్షుడిని నిలదీసినట్లు ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. శనివారం పాలకవర్గ సమావేశంలో ఎలాంటి తీర్మానం లేకుండా ఇష్టానుసారంగా డబ్బు ఖర్చు చేశారంటూ డైరెక్టర్లు సమావేశాన్ని బహిష్కరించడం చర్చనీయాంశంగా మారింది. అంతేకాకుండా డైరెక్టర్‌ బొడ్డు మణెమ్మ యాసంగి కొనుగోలు కేంద్రాల ప్రారంభానికి ముందు ప్రతి డైరెక్టర్‌కు రూ.20 వేల చొప్పున ముట్టజెప్పింద్రు, నాకెందుకు ఇవ్వాలేదంటూ అధ్యక్షుడిని ప్రశ్నించినట్లు సమాచారం. ఈ విషయమై అధ్యక్షుడు శ్రీనివాస్‌ను వివరణ కోరగా గ్రామాల వారీగా ఖర్చుల వివరాలు కోసం అడిగారు. నాలుగైదు రోజుల్లో గ్రామాల వారిగా నివేదికను అందిస్తానని డైరెక్టర్లతో సమాధానం చెప్పానని, ఎలాంటి అక్రమాలు జరగలేదని ఆయన తెలిపారు.